క్లుప్తంగా

వృద్ధులకు కంటి పరీక్షలు



వృద్ధురాలికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: కంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం వలదని, వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు ప్రభుత్వం ఇస్తుందని గణపవరం మండలం డి.కుముదవల్లి సర్పంచ్ తూము వీరవెంకటవేణి అన్నారు. గురువారం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని డి.కుముదవల్లి గ్రామ సచివాలయంవద్ద వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ కంటి ఆరోగ్యానికి పలు సూచనలు ఇచ్చారు. ఎక్కువగా ఆకు కూరలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సుమారు 55 మందికి కంటి పరీక్షలు చేయగా అందరికీ కళ్లజోళ్లు అవసరమని గుర్తించామని వీరందరికి ఉచితంగా కళ్లజోళ్లు ఇస్తామని కంటి వెలుగు అధికారి శ్రీనివాస్ అన్నారు.

సీజనల్ జ్వరాలపై అవగాహన



కాశిపాడులోలో ఆరోగ్య అవగాహన ప్రదర్శన చేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: సీజనల్ జ్వరాలపై అపోహలు వీడాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే రోగాలకు దూరంగా, ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైవి లక్ష్మణరావు అన్నారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రత పాటించడం ద్వారా అంటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని అవగాహన కల్పించారు. గురువారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని చిలకంపాడు, కాశిపాడు గ్రామాలలో వైద్య సిబ్బంది ప్రజలకు అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల నిర్మూలనతో అంటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వరాలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్యసహాయకుడు నామాలరాజు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



అడవికొలనులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నిడమర్రు: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత నిమ్మల బుజ్జి ఆధ్వర్యంలో అడవికొలను గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆపార్టీ నిడమర్రు మండల బాధ్యులు పుప్పాల కన్నబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిమ్మల కుటుంబ సభ్యులు సేవలను పలువురు నేతలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ నొడు అచ్యుతరామారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు పాపోలు సుబ్బారావు, ఆర్‌బీకే చైర్మన్ పాపోలు సుబ్బారావు, యూటీఎఫ్ మండల అధ్యక్షులు మండల రామకృష్ణ, వైసీపీ నేతలు నిమ్మల రమేష్, పాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్రాంతి ప్రసాద్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



క్రాంతి ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఉపాధి హామీ పథకం దెందులూరు టెక్నికల్ అసిస్టెంట్ క్రాంతి ప్రసాద్ కుటుంబానికి త్వరితగతిన ప్రభుత్వ ఉద్యోగం మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. దెందులూరులో ఇటీవల మృతి చెందిన టెక్నికల్ క్రాంతి ప్రసాద్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గురువారం పరామర్శించారు. క్రాంతి ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి కుటుంబానికి జాబ్‌కార్డు మంజూరు, పని కల్పిన, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు మధ్య వారధిగా మంచిపేరు తెచ్చుకున్న క్రాంతి ప్రసాద్ మృతి బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ క్రాంతి ప్రసాద్ కుటుంబానికి వెన్నుదన్నుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, నాయకులు పోకల రాంబాబు, తొత్తడి వేదకుమారి, కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, కొలుసు గణపతిరావు, రాము, కొంగర రత్నకుమార్ అబ్బాస్, అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, మేట్లు ఉన్నారు.

జగనన్న కాలనీల్లో నూరుశాతం మౌలిక వసతులు



బావాయిపాలెం జగనన్న కాలనీలో విద్యుత్ సరఫరాను ప్రారంభించిన ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీల్లో నూరుశాతం మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం బావాయిపాలెం గ్రామంలో నిర్మిస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీలో రూ 28 లక్షలుతో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైన్లున్న విద్యుత్ సరఫరాను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. మండలంలో రూ.2.68 కోట్లుతో జగనన్న కాలనీల్లో నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. పెద నింద్రకొలను రూ.48 లక్షలు, నిడమర్రు రూ.20 లక్షలు, బువ్వనపల్లి రూ.30లక్షలు, అడవికొలను రూ.56 లక్షలు, క్రొవ్విడి 28 లక్షలు, చానమిల్లి రూ.30 లక్షలు , తోకలపల్లి రూ.14లక్షలు, పత్తేపురం రూ.14 లక్షల నిధులు కేటాయించి పనులు పూర్తి చేసామన్నారు. ప్రభుత్వం నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇళ్లు ఆధునిక లేఅవుట్ ఊళ్లుగా తీర్చి దిద్దేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశి, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, సర్పంచ్ ముత్యాల పద్మావతి, ట్రాన్స్‌కో ఈఈలు ఎ. వెంకటేశ్వరరావు, ఎస్. వెంకటేశ్వరరావు, ఏడీ చంద్రశేఖర్, ఏఈ మురళీ కృష్ణ తదితరులున్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



గణపవరంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పిల్లలతో వైస్ ఎంపీపీ, సర్పంచ్

గణపవరం: విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలు దోహదం చేస్తాయని, విద్యార్థులంతా ఈశిబిరాలకు హాజరై తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గణపవరం మండల ఉపాధ్యక్షురాలు సలాది దుర్గారత్నకుమారి, గణపవరం సర్పంచ్ మూర అలంకారం అన్నారు. గణపవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని వారు సందర్శించి పిల్లలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వం వేసవి విజ్ఞాన శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో అభివృద్ధికమిటీ సభ్యులు గ్రంథపాలకుడు పాల్గొన్నారు.

యోగా ద్వారా విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం

భీమడోలు: యోగా ద్వారా విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆరా ఫౌండేషన్ అధినేత భావానారుషి అన్నారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరం పురస్కరించుకుని నాలుగో రోజైన గురువారం చిన్నారులు సామూహిక పఠనం కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని నీతి కథలు చదవి వాటిని సమీక్షలు రాశారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిన్నారులకు యోగాసనాలపై శిక్షణ అందించారు. డైమండ్స్ లయన్స్ క్లబ్ కోశాధికారి ఇంగ్లీషు ట్రైనర్ సత్యేంద్ర చిన్నారులు స్పోకెన్ ఇంగ్లీషులోని మెలకువలను తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ నీతి కథలు చెప్పారు. అనంతరం ఆట పాటలతో కూడిన శిక్షణ అందించారు.

భీమడోలులో గాలివాన బీభత్సం





పూళ్ల, ఎంఎంపురం రహదారి వెంబడి పడిన చెట్లను తొలగిస్తున్న దృశ్యం, పూళ్ల, ఎంఎంపురం రోడ్డులో కారుపై పడిన చెట్టు



ఈదురుగాలుల ధాటికి కోడూరుపాడులో ఇంటిపై రేకులు ఎగిరిపోయిన దృశ్యం



పూళ్లలో ప్రధాన రోడ్డుపై పడిన విద్యుత్‌వైర్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ షంషూద్దీన్



పంట పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభం

భీమడోలు: మండలంలో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాయి. ఈదురుగాలులతో పాటు వర్షం కూడా దంచి కొట్టడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పలు చోట్ల కార్లపై చెట్లు విరిగిపడ్డాయి. అంతేకాదు ఈదురుగాలుల దెబ్బకు విద్యుత్ శాఖ తీవ్రంగా నష్టపోయింది. సుమారు రూ.70 లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రధాన రహదారులకు అడ్డుగా దశాబ్దాల కాలంగా నాటి భారీ చెట్లు నేలమట్టం కావడంతో వాహనదారులు రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోడూరుపాడులోని ఇండ్ల పై కప్పుల్లోని రేకులు ఎగిరిపోయాయి. ఆక్వా చెర్వుల వద్ద ఉన్న పోల్స్ పాక్షికంగా దెబ్బతిన్నాయి. పూళ్ల నుంచి ఎంఎంపురం వరకు రహదారి వెంబడి ఉన్న భారీ వృక్షాలు ఈదురు గాలులకు కూలి విద్యుత్ స్తంభాలపై పడడంతో సుమారు 60 స్తంభాలు ధ్వంసమయ్యాయి. దుద్దేపూడి ఏరియాలో 15 విద్యుత్ పోల్స్‌కు దెబ్బతిన్నాయి.

తహసీల్దార్ షంషూద్దీన్ పర్యటన

మండలంలోని పూళ్ల, కోడూరుపాడు, దుద్దేపూడి, కురెళ్లగూడెం గ్రామాల్లో తహసీల్దార్ షంషూద్దీన్ ఈదురుగాలుల ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులు కోరారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రభావిత ప్రాంతాలకు మంచినీటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావుకు సూచించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధిస్తే అందరికీ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ టీఎన్ స్నేహన్

భీమడోలు: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధిస్తే అందరికీ ఆరోగ్యం అందించవచ్చునని సచివాలయాల సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం జిల్లా కోఆర్డినేటర్ టీఎన్ స్నేహన్ అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీ వద్ద గురువారం వైద్యాధికారి టి.ప్రసాద్ అధ్యక్షతన గ్రామస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహన్ మాట్లాడుతూ గ్రామ సామాజిక ఆరోగ్య అధికారి బృంద నాయకుడిగా వ్యవహరించే కమిటీ ప్రతి నెలా సమావేశమైన 17 సుస్థిర లక్ష్యాలల్లో మొదటి ఐదు లక్ష్యాలను సాధన కోసం చర్చించాలన్నారు. అందరికీ ఆరోగ్యం అందించే లక్ష్య సాధనలో భాగంగా గర్భిణులు, బాలింతలు, యుక్త వయస్సు, బాలల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. క్రమం తప్పకుండా వారికి రక్త శాతాన్ని తెలుసుకునే పరీక్షలు చేయాలన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం అధికారి లీడర్‌గా ఉన్న టీములో ఎఎన్ఎం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్త, పాఠశాల ఆరోగ్య అంబాసిడర్, గ్రామసంఘం అధ్యక్షులు వాటిపై ప్రత్యేక దృష్టిని సారిస్తారన్నారు. అనంతరం రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ నాగరత్నం, హెచ్ఈవో అన్నపూర్ణ, హెచ్ఈ మల్లేశ్వరి పాల్గొన్నారు.

6970 మంది రైతుల ఖాతాల్లో రూ.107 కోట్ల జమ



ఆర్‌బీకే సెంటర్లో ధాన్యం ఎగుమతి పై సమీక్షిస్తున్న ఆర్‌డీఓ పెంచల కిషోర్

ఉంగుటూరు: మండలంలో 8371 మంది రైతులకు 125 కోట్ల 42 లక్షల 42 వేల నాలుగు వందల రూపాయలు రైతులుకు ధాన్యం డబ్బు అందజేయాల్సి ఉండగా ఇప్పటికి 107 కోట్ల 62లక్షల, 72 వేల ఆరువందల అరవై ఆరు రూపాయలను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసిందని ఏలూరు ఆర్‌డీఓ పెంచల కిషోర్ తెలిపారు. గురువారం ఉంగుటూరు మండలంలో ధాన్యం ఎగుమతులపై ఆర్‌బీకే సెంటర్లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఉంగుటూరు మండలం నుంచి అరవై లారీల్లో ధాన్యం ఎగుమతి అయ్యిందని పేర్కొన్నారు. మరో వారం రోజుల్లో ధాన్యం ఎగుమతులు పూర్తవుతాయని చెప్పారు. ధాన్యం మిల్లుల్లో నిల్వ ఉన్న బియ్యాన్ని గోడౌన్లుకు తరలించేందుకు లారీలను తరలించడంతో గురువారం కొన్ని లారీలు తగ్గాయని ఆర్‌డీఓ తెలిపారు. మిల్లులో సరుకు ఖాళీ చేస్తే ధాన్యం మిల్లుల్లో నిల్వ చేసే వీలు కలుగుతుందని పేర్కొన్నారు.

రాగి వైరు చోరీ


పెదపాడు: కొక్కిరపాడు పంట పోలా ల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు బుధవారం రాత్రి పగులగొట్టి కాపర్‌వైరును ఎత్తుకుపోయారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విధుల్లోకి నైట్ వాచ్‌మెన్లు.. పాఠశాలలకు రక్షణ

37 పాఠశాలలకు నియామకం

దెందులూరు: నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించి, నూతన భవనాలను నిర్మించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తాజాగా పాఠశాలల భద్రత, అక్కడ పరికరాలు, పరికరాల పరిరక్షణ కోసం నైట్ వాచ్‌మెన్ల నియమించింది. దెందులూరు నియోజకవర్గంలోని దెందులూరు మండలంలో ఏడు, పెదవేగి మండలంలో 11, పెదపాడు మండలంలో 11, ఏలూరు రూరల్‌లో ఎనిమిది హైస్కూళ్లు ఉన్నాయి. ఈ 37 హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్లను ప్రభుత్వం నియమించింది. వీరికి నెలకు రూ.6 వేలు గౌరవవేతనం కల్పించింది. ఈ నియామక ప్రక్రియను ప్రభుత్వ పాఠశాలల పేరెంట్ కమిటీలు, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో మే 1వ తేదీన పూర్తి చేశారు. నైట్ వాచ్‌మెన్లు నిత్యం పాఠశాల మూసివేసే ముందు సాయంత్రం పాఠశాలకు హాజరుకావాలి. పనిదినాల్లో మరుసటి రోజు పాఠశాల తెరిచే వరకు విధుల్లో ఉండాలి. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పనిచేయాలి. పాఠశాల భవనం, ఇతర వస్తువులను రక్షించాలి. పాఠశాల ప్రాంగణంలోకి అనధికారిక వ్యక్తులు ప్రవేశించకుండా చూడాలి. సాయంత్రం పాఠశాలలో ఉన్న గార్డెన్‌లో మొక్కలు నీరుపోయాలి. ఆర్‌ఓ ప్లాంట్‌ను శుభ్రంగా ఉంచాలి. పాఠశాల మెటీరియల్ తీసుకురావడం, వాటిని హెచ్ఎంకు అందించడం చేయాలి.


1 నుంచే విధుల్లోకి వాచ్‌మెన్లు



జిల్లాలో పాఠశాలల్లో వాచ్‌మెన్ల నియామక ప్రక్రియ పూర్తిచేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు మే నెల 1వ తేదీ నుంచి వాచ్‌మెన్లు విధులు చేపట్టారు. ప్రభుత్వ స్కూళ్ల పరిరక్షణతో పాటు వాటిభద్రత, పర్యవేక్షణ తీసుకున్నారు.

– రవిసాగర్, జిల్లా విద్యాసాగర్, ఏలూరు జిల్లా

సంతోషంగా ఉంది



నైట్‌వాచ్‌మెన్ ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలను నా ఇంటిలాగే కాపాడటానికి కృషి చేస్తాను. ఈ అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌లకు నేను. నా కుటుంబం రుణపడి ఉంటాం.

– గండి ప్రకాశరావు, నైట్‌వాచ్‌మెన్, దెందులూరు పాఠశాల

ఆకట్టుకున్న కోలాట నృత్యం



కోలాట బృందంతో గారపాటి చౌదరి

పెదవేగి : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో శ్రీహరి శ్రీనివాస కోలాట భజన బృందం ఆధ్వర్యంలో గురువారం రాత్రి గజ్జపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా నేర్చుకున్న బృందం సభ్యులు నిర్వహించిన కోలాట నృత్యం ఆకట్టుకుంది. కోలాటం నేర్పిన గురువు సత్తార్‌ను తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి సత్కరించారు. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో జిల్లా వ్యాప్తంగా ఉన్న కోలాట బృందాలతో భారీ ప్రదర్శన ఏలూరులో ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో జాస్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు జాస్తి లక్ష్మీనారాయణ, వల్లభనేని సురేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నీలాద్రిపురంలో రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు: నీలాద్రిపురం గ్రామానికి రెండురోజులు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీరామ్ గురువారం విలేకరులకు తెలిపారు. నీలాద్రిపురంలో వైఎస్సార్ కాలనీ ఇళ్ల నిర్మాణాలకు అడ్డుగా ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్‌ను పక్కకు మార్చే పనులు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కారణంగా శుక్రవారం, శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంగరంగ వైభవంగా హనుమద్ జయంతి ఉత్సవాలు



విద్యుత్ కాంతుల్లో అభయాంజనేయస్వామి ఆలయం



డిజిటల్ లైటింగ్ బోర్డు

అప్పనవీడు (పెదపాడు): కృష్ణా, ఏలూరు జిల్లాల సరిహద్దు ప్రాంతం హనుమాన్ జంక్షన్ (అప్పనవీడు)లో అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమద్ జయంతి ఉత్సవాలను దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అభయాంజనేయస్వామి ఆలయం, ఆలయం వద్ద విద్యుత్ అలంకరణ పందిళ్లు, డిజిటల్ లైటింగ్ బోర్డులు విద్యుత్ కాంతులతో కనువిందు చేస్తున్నాయి. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడుతోంది. ఉత్సవాల చివరిరోజు ఈ నెల 14న స్వామి ఉత్సవ మూర్తిని హనుమాన్ జంక్షన్ పురవీధుల్లో ఊరేగించనున్నారు. భక్తులకు భారీ అన్నదానం ఏర్పాటు చేయనున్నారు. గురువారం సీనియర్ జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు చలమశెట్టి శ్యామ్ తేజస్వీ దంపతులు స్వామి వారికి సహస్రనామార్చన చేశారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ

దెందులూరు: జోగన్నపాలెం రామాలయంలో గురువారం ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొని ధ్వజస్తంభం, యాగశాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. యాగశాల వద్ద పూజల్లో గ్రామ సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి ప్రభాకరరావు, సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సొసైటీ మాజీ చైర్మన్ డాక్టర్ పసుమర్తి మధు, శాంతకుమార్, నిట్టా గాంధీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

దేవదాయ ధర్మదాయ శాఖ

భూములు సేద్యమునకు టెండర్ –కం– బహిరంగ వేలం ప్రకటన

[illegible]

వ. నెం.	దేవస్థానము పేరు & గ్రామం	భూమి ఉన్న గ్రామం	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.సెం	పల్లం/మెట్ట	ధరావత్తు	కాల పరిమితి	వేలం జరుగు తేదీ సమయం, ప్రదేశం
1.	[illegible]	[illegible]	[illegible] 273	0-34 3-88 4-32	పల్లం	15,000	2023-24 to 2025-26	[illegible] ఉ.11.00 గం.లకు [illegible]
2.	[illegible]	[illegible]	283	1-16	పల్లం	15,000		

[illegible]

తేది : 11-05-2023

దేవదాయ ధర్మదాయ శాఖ

భూములు సేద్యమునకు టెండర్ –కం– బహిరంగ వేలం ప్రకటన

[illegible]

వ. నెం.	దేవస్థానము పేరు & గ్రామం	భూమి ఉన్న గ్రామం	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.సెం	పల్లం/మెట్ట	ధరావత్తు	కాల పరిమితి	వేలం జరుగు తేదీ సమయం, ప్రదేశం
1.	[illegible]	[illegible]	334 335	1-30 3-50 4-80	పల్లం	15,000	2023-24 to 2025-26	[illegible] ఉ.11.00 గం.లకు [illegible]

[illegible]

తేది : 11-05-2023